



ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం
# జనం ముచ్చట
ఆదివారం, సెప్టెంబర్ 13, 2026 | తెలంగాణ | పేజీలు : 4






2 లో..

### కరెంట్ కోతలపై...

# రైతుల కన్నెర్ర

**వేంసూరు,సెప్టెంబర్ 13 (జనం ముచ్చట):** విద్యుత్ కోతలకు నిరసనగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం కందుకూరులో రైతులు ఆందోళనకు దిగారు. కందుకూరు, దిద్దుపూడి, భరణిపాడు, లచ్చన్నగూడెం గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసన ర్యాలీ నిర్వహించి సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు.వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం కనీసం ఏడు గంటల విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

### కందుకూరులో సబ్‌స్టేషన్ ముట్టదించిన రైతులు...

### అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

### యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణంలో...

# నాణ్యతలో .. రాజీ వద్దు

### అధికారులకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశం





- యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలి...
- నిర్ణీత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి...
- వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి...
- ఐదు పాఠశాలలకు ఒక్కొక్కదానికి రూ.200 కోట్లతో నిర్మాణం...



2 లో..

**ఖమ్మం (జనం ముచ్చట):** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణ పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు పాఠశాలలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.శనివారం మధిర నియోజకవర్గం బోనకల్ మండలం లక్ష్మీపురంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హాస్టల్ భవనాలు, అకడమిక్ బ్లాకులు, డార్మెటరీ, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ తదితర నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలించారు. భవనాల నిర్మాణ పురోగతితో పాటు పనుల్లో పాటిస్తున్న

# కరెంట్ కోతలపై... రైతుల కన్నెర్ర

(మొదటి పేజీ తరువాయి)

**రైతుల ఆందోళనకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం...**

రైతుల ఆందోళనకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంఘీభావం తెలిపారు. రైతులతో కలిసి సబ్‌స్టేషన్‌కు చేరుకున్న ఆయన విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా సండ్ర మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కరెంట్ తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సి వస్తుందని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కేసీఆర్ సవాల్‌గా తీసుకుని తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించారని అన్నారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండగగా మార్చి రైతులకు భరోసా కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు....

**మళ్లీ కరెంట్ కోతలు ఎందుకు విధిస్తున్నారు ?**

తెలంగాణలో మళ్లీ విద్యుత్ కోతలు ఎందుకు విధిస్తున్నారని సండ్ర వెంకట వీరయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుల విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి సరఫరాకు ప్రణాళిక రూపొందించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని విమర్శించారు. అవసరమైతే ఇతర రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేసైనా రైతులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, పంటలను కాపాడుకోవడం కష్టంగా మారుతోందని అన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేసే విధానాలను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు....

**ఎరువుల కోసం రైతులను ఇబ్బంది పెట్టొద్దు...**

ఎరువుల పంపిణీ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని సండ్ర ఆరోపించారు. యాప్ ద్వారా ఎరువుల పంపిణీ పేరుతో రైతులకు ఇబ్బందులు సృష్టించడం సరికాదన్నారు. చాలామంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో లేవని, గతంలో మాదిరిగానే కూపన్ల విధానంలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఎరువుల



కొరత ఏర్పడకుండా ప్రభుత్వం ముందుగానే పరిస్థితిని అంచనా వేసి అవసరమైన మేరకు నిల్వలు ఏర్పాటు చేయాలని సూచించారు....

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

వరంగల్ రైతు డిక్లరేషన్‌లో అన్ని రకాల పంటలకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి, ప్రస్తుతం కొన్ని పంటలకే బోనస్‌ను పరిమితం చేయడం రైతులను మోసం చేయడమేనని సండ్ర విమర్శించారు. రైతు కూలీలకు అండగా ఉంటామని, రైతు భరోసా పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా ఆచరణలో అమలు చేయాలని అన్నారు....

**సీతారామ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రచారం సరికాదు....**

సీతారామ ప్రాజెక్టుపైనా సండ్ర వెంకట వీరయ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మాణానికి భారీగా నిధులు వెచ్చించి పనులను ముందుకు తీసుకెళ్లిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్ప నిధులతో చేపట్టిన పనులకు మొత్తం ప్రాజెక్టు ఘనతను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతులకు కోతలు లేని విద్యుత్ అందించి పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు...

**విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లాగ్‌బుక్ పరిశీలన...**

రైతుల ఆందోళన సందర్భంగా సండ్ర వెంకట వీరయ్య సబ్‌స్టేషన్‌లోకి వెళ్లి విద్యుత్ సరఫరాకు సంబంధించిన లాగ్‌బుక్‌ను పరిశీలించారు. లాగ్‌బుక్‌ను చూపించేందుకు అధికారులు తొలుత కొంత నిరాకరించడంతో విద్యుత్ సరఫరా పరిస్థితిపై మరిన్ని అనుమానాలు వ్యక్తమయ్యాయని ఆయన అన్నారు. అనంతరం లాగ్‌బుక్‌ను పరిశీలించిన సండ్ర.. రైతులకు వాస్తవంగా ఎంతసేపు విద్యుత్ సరఫరా అవుతోంది, ఎంతసేపు అంతరాయం ఏర్పడుతోంది అనే వివరాలను పరిశీలించారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా తప్పించుకునే ధోరణిని అధికారులు, ప్రభుత్వం విడనాడాలని సూచించారు....

**సమస్య పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం...**

విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించి రైతులకు కోతలు లేని విద్యుత్ అందించాలని సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. రైతులను ప్రస్తుత పరిస్థితుల్లో మరింత ఇబ్బందుల్లోకి నెట్టకుండా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కందుకూరులో రైతులతో ప్రారంభమైన ఈ ఆందోళన ఆరంభం మాత్రమేనని, విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రైతులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని సండ్ర వెంకట వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల పంటలను కాపాడేందుకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు..

## యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణంలో... నాణ్యతలో రాజీ వద్దు





(మొదటి పేజీ తరువాయి)

నాణ్యతా ప్రమాణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి పనిని నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్మాణ సంస్థలు మరియు ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పనుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు....

**రూ.200 కోట్లతో 25 ఎకరాల్లో నిర్మాణం....**

ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో భాగంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఖమ్మం జిల్లాలో ఐదు పాఠశాలలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాలను రూ.200 కోట్ల అంచనా వ్యయంతో 25 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మిస్తున్నట్లు వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులు చిన్ననాటి నుంచే ఒకే వాతావరణంలో, సమాన అవకాశాలతో కలిసి చదువుకునేలా ఈ సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యతో పాటు విద్యార్థుల్లో క్రీడా ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేలా అత్యాధునిక మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. మధిర నియోజకవర్గానికి సంబంధించిన లక్ష్మీపురం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనుల్లో వేగం పెంచి, అగ్రిమెంట్‌లో నిర్దేశించిన ప్రమాణాలు, గడువులకు అనుగుణంగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు....

**ఏప్రిల్ నాటికి నిర్మాణం పూర్తి....**

వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పాఠశాల నిర్మాణ పనులను పూర్తిచేసి సంబంధిత శాఖకు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులు పాఠశాలను వినియోగించుకునేలా భవన నిర్మాణంతో పాటు అన్ని అనుబంధ పనులను కూడా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం తదితర మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకుని పనులు చేపట్టాలని సూచించారు. హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.....

**రూ.29 కోట్లతో నర్సింగ్ కళాశాల...**

అనంతరం చింతకాని మండలం లచ్చగూడెంలో రూ.29 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను కూడా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో బోనకల్ తహసీల్దార్, విద్యాశాఖ ఇంజినీరింగ్ అధికారి బుగ్గయ్య, సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.....

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నియోజకవర్గ పర్యటన

ఖమ్మం సిటీ (జనం ముచ్చట):



మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పువ్వాడ అజయ్‌కుమార్ ఈ నెల 13న ఖమ్మం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ కార్యకర్తలు, ప్రజలను కలుసుకోనున్నారు. పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలోని గట్టయ్య సెంటర్‌లోని రోటరీ క్లబ్‌లో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమానికి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరవుతారు. పువ్వాడ నాగేశ్వరరావు 88వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 88 మంది దివ్యాంగులకు కృత్రిమ పాదాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని దివ్యాంగులకు కృత్రిమ పాదాలను అందజేయనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరుకానున్నారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలతో సమావేశమై స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. మాజీ మంత్రి పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యక్తిగత సహాయకుడు సీహెచ్ రవికిరణ్ పర్యటన వివరాలను వెల్లడించారు.

## ఖమ్మం రూరల్ కాంగ్రెస్‌లోకి..

# వలసల జోరు

### కామంచికల్ గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్, సీపీఐ నుంచి 25 కుటుంబాల చేరిక

**ఖమ్మం రూరల్ (జనం ముచ్చట):**
కాంగ్రెస్ పార్టీలోకి వలసల జోరు కొనసాగుతోంది. ఖమ్మం రూరల్ మండలం కామంచికల్ గ్రామపంచాయతీ పరిధిలో బీఆర్ఎస్, సీపీఐ పార్టీలకు చెందిన 25 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. శనివారం ఖమ్మంలోని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి 25 కుటుంబాలను కాంగ్రెస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పాలన, ప్రజలకు అందుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు....



**ప్రజా పాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి....**
ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ప్రజల ప్రభుత్వమని అన్నారు. ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను గడపగడపకూ చేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. "ప్రజా పాలనకు జై.. కాంగ్రెస్‌లో చేరికలకు సై" అంటూ ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికల పరంపర కొనసాగుతోందని దయాకర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.....

**పార్టీలో చేరిన నాయకులకు శుభాకాంక్షలు తెలిపిన దయాకర్ రెడ్డి....**
కాంగ్రెస్ పార్టీలో చేరిన 25 కుటుంబాల సభ్యులకు పార్టీ నాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి మరియు మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ప్రతాపనేని రఘు, మాజీ సర్పంచ్ యాదా లింగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మక్కా మల్లయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్.కె. మైబు, జంగాల రామారావు, చింతకాయల వెంకన్న, బండారు నాగేశ్వరరావు, దాసరి వెంకటనారాయణ, అనంతనేని మురళి, లక్ష్మణ్, జంగం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మె

**కల్లూరు, సెప్టెంబర్ 12, (జనం ముచ్చట)**




16వ తేదీ కల్లూరు మున్సిపాలిటీ కార్మికుల నిరవధిక సమ్మెకు సిద్ధమైనట్లు మున్సిపాలిటీ కార్మికులు సంఘం ఏఐటీయూసీజిల్లా ఉపాధ్యక్షులు ఊడల కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం ముందు కార్మికులు శనివారం నిరసన కార్యక్రమం తెలిపి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులకు గత తొమ్మిది నెలలుగా పెండింగ్ వేతనాలు ఉన్న పాలకవర్గానికి మున్సిపాలిటీ అధికారులకు స్పందన లేదని కనుక 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు .16వ తేదీ బుధవారం నుంచి పూర్తిస్థాయిలో విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొంటున్నట్లు వారి పేర్కొన్నారు .వేతనాలు లేక కుటుంబాలు అప్పుల పాలై జీవనం ఇబ్బందికరంగా మారిందని ప్రైవేటు వ్యక్తుల వద్దఅప్పులు తెచ్చుకొని జీవనం కొనసాగిస్తున్నామని 9 నెలలైనా పాలకవర్గానికి ప్రభుత్వాధికారులకు స్పందన లేకుండా నిర్లక్ష్యంగా కార్మికుల పట్ల వ్యవహరిస్తున్నారని కార్మికుల కష్టాలు పట్టించుకోకుండా పట్టి పట్టనట్లు ఉన్నారని పేర్కొన్నారు. కార్మికులకు ఒక్కొక్కరికి లక్షన్నరపైగా రావాల్సి ఉండగా జీవనం ఇరుగుపొరుగు వారిపై ఆధారపడిందని మావేతన వెతలు మా గోడు ఎవరికి చెప్పుకోలేక పోతున్నారని ఆయన వివరించారు. నిర్లక్ష్యం ధోరణిలో ఉన్న పాలకవర్గం మున్సిపాలిటీ అధికారులు తోపాటు ప్రజాప్రతినిధులు పట్టించుకోని మా కుటుంబాలను ఆదుకోవాలని అంటూ వారికి మొరపెట్టుకుంటున్నారు. జీతమా జీవితమా ఇదేమి వేదన అంటూ ఒకరినొకరు ప్రశ్నించుకుంటున్నారు. మున్సిపాలిటీ ప్రజలు కార్మికులకు మద్దతునిచ్చి సంఘీభావంతో ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సిపిఐ మండలకన్వీనర్ కొత్తపల్లి వెంకటనారాయణ జిల్లా మున్సిపాలిటీ కార్మిక సంఘం కార్యదర్శి వజేర్మియా మున్సిపాలిటీ సోషల్ మీడియా అధ్యక్షులు మణి రాజు ,జరిపోతుల మంగమ్మ, ఖమ్మంపాటి రాణి ,ఉబ్బన మురళి, నరసింహారావు, సుధాకర్, జగదీష్ పాల్గొన్నారు.

### 48వ డివిజన్‌లో పడకేసిన పారిశుధ్యంపై మండిపడ్డ..

## మాజీ కార్పొరేటర్ తోట రామారావు



**ఖమ్మం (జనం ముచ్చట)**
ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో పారిశుధ్య పరిస్థితులు అధ్వానంగా మారుతున్నాయని, ప్రజా సమస్యలపై కార్పొరేషన్ అధికారులు స్పందించడం లేదని మాజీ కార్పొరేటర్ తోట రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ పరిధి విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ అందుకు అనుగుణంగా పారిశుధ్య సిబ్బంది లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో పారిశుధ్య సిబ్బందిని పెంచాలని, విపరీతంగా పెరిగిన చెట్లు, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు వారానికి కనీసం మూడు రోజులు జేసీబీని కేటాయించాలని తాను మాజీ ప్రజాప్రతినిధిగా పలుమార్లు కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రాలు అందజేశానని తోట రామారావు తెలిపారు. అయినప్పటికీ అధికారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.



**ప్రజా సమస్యల పరిష్కారం కోసం సొంత నిధులతో సేవలు....**
కార్పొరేషన్ అధికారులు స్పందించకపోయినా, ఈ ప్రాంతానికి మాజీ ప్రజాప్రతినిధిగా ప్రజల సమస్యలపై స్పందించాల్సిన బాధ్యత తమపై ఉందని తోట రామారావు అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గతంలోనూ పలుమార్లు సొంత నిధులతో జేసీబీలను ఏర్పాటు చేసి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం కూడా సొంత నిధులతో జేసీబీని ఏర్పాటు చేసి గణేష్‌నగర్ ప్రాంతంలో డ్రైనేజీలను, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధించిన స్థలాలను కూడా పరిశుభ్రం చేస్తున్నామని వివరించారు.

**మంచినీటి సరఫరాకు సొంత ట్యాంకర్....**
గత వారం భగీరథ పైపులైన్ నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా తమ సొంత ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేసినట్లు తోట రామారావు తెలిపారు. ప్రజాక్షేత్రంలో ప్రజలకు అవసరమైన సమయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. 48వ డివిజన్‌లో పారిశుధ్య సిబ్బంది కొరత, జేసీబీ అవసరం, మంచినీటి సరఫరా తదితర అంశాలపై ఎన్నిసార్లు అధికారులకు వినతిపత్రాలు అందించినా స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు.

**అధికారులు తక్షణమే స్పందించాలి....**
ఇప్పటికైనా సంబంధిత కార్పొరేషన్ అధికారులు స్పందించి 48వ డివిజన్‌లో పారిశుధ్య సిబ్బందిని పెంచడంతో పాటు అవసరమైన మేరకు జేసీబీని కేటాయించాలని తోట రామారావు కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీలు, చెత్తాచెదారం, పెరిగిన చెట్లు తొలగించే చర్యలు చేపట్టాలని, మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ బాబు, అంజయ్య, గుణగంటి శ్రీనివాస గౌడ్, యాసారపు ఉపేందర్, తోట రమేష్, చేతి క్రిష్ణ, రమణ, ప్రభాకర్, నవీన్, కిషన్ నాయక్, బాబా పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం..

**రాజీ పడడానికి అవకాశం ఉన్న అన్ని కేసుల్లో రాజీ పడవచ్చు..**

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు.**

**జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో 3 వ జాతీయ లోక్ అదాలత్ ను ప్రారంభించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

ఖమ్మం (జనం ముచ్చట)

రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ/వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు.

ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.




ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు.
కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు.
పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు.
ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు.
ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# రైస్ మిల్లుల సమస్యలను పరిష్కరించండి

## - రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి

కొత్తగూడెం, సెప్టెంబర్ 12 - (జనం ముచ్చట):

ధాన్యం మిల్లింగ్ నిలిపివేత , బిల్లింగ్ సమయం లో ఏర్పడిన తరుగు మరియు ఎఫ్ సి ఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయం తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కు వినతి పత్రం అందజేశారు. ఈ విషయాలకు సంబంధించి 7- 9- 2026 తేదీన జరిగిన రాష్ట్ర రైస్ మిల్లర్ల ప్రెస్ మీట్ లో తీసుకున్న నిర్ణయం మేరకు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని రైస్ మిల్లులు నేటి నుండి మిల్లింగ్ కార్యక్రమాలు నిలిపివేయాలని నిర్ణయించుకున్నామని, బిల్లింగ్ ప్రక్రియలో ట్రాన్స్పోర్ట్ , నూకలు , పరమ ఇతర తరుగుదలలు కలిపి సుమారు 15% నుండి 20% వరకు తరుగు వస్తుందని, ఈ తరుగుదలను ఫిజికల్ వెరిఫికేషన్ సమయంలో సరైన విధంగా తీసుకోకపోవడం వల్ల రైస్ మిల్లర్స్ కు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని , ఈ కారణంగా ప్రస్తుతం మిల్లింగ్ ప్రక్రియ కొనసాగించడం ఆర్థికంగా సాధ్యం కానీ పరిస్థితి ఏర్పడిందని, ఎఫ్సీఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరించకుండా రా రైస్ మాత్రమే ఇవ్వాలని సూచిస్తున్నప్పటికీ , మిల్లులకు కేటాయించబడు తున్న ధాన్యం రా రైస్ తయారీకి అనుకూలంగా లేకపోవడం వల్ల , దానిని రా రైస్ గా మిల్లింగ్ చేసి సరఫరా చేయటం సాధ్యం కాని పని పరిస్థితి నెలకొన్నదని, పై సమస్యలకు తగిన పరిష్కారం లభించే వరకు మిల్లింగ్ కార్యక్రమాలు నిలిపివేయాలని జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ నిర్ణయించుకున్నదని చెప్పారు. ఈ సమస్యలపై సానుకూలంగా పరిశీలించి రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను తగిన పరిష్కారం చూపటంతో పాటు, ఎఫ్సిఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణ , మరియు మిల్లింగ్ కు సంబంధించిన ఇతర సమస్యలను తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జుగల్ కిషోర్ ఖండేల్వాల్, సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, ట్రెజరర్ పల్లపోతు శ్రీనివాసు, వెంకటేశ్వర రెడ్డి, కంచర్ల శ్రీనివాసు, జిల్లా రైస్ మిల్లు ప్రతినిధులు పాల్గొన్నారు.



# జాతీయ లోక్ అదాలత్ ద్వారా 10,955 కేసుల పరిష్కారం

## సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు రూ.27.90 లక్షలకు పైగా రిఫండ్: పోలీస్ కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం (జనం ముచ్చట)



జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని, లోక్ అదాలత్ ద్వారా రాజీకి అవకాశం ఉన్న 10,955 కేసులు పరిష్కరించామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.
లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించిన 10,955 కేసుల్లో 985 ఎఫ్ఐఆర్ కేసులు, 3301 ఈ-పెట్టీ కేసులు, 6621 డ్రంకెన్ అండ్ డ్రైవ్ కేసులు, 48 సైబర్ క్రైమ్ కేసులు ఉన్నాయని తెలిపారు.
సైబర్ క్రైమ్ కేసుల్లో బాధితులకు మొత్తం రూ.27,90,612/- రిఫండ్ మొత్తాన్ని అందజేసినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.
“రాజీ మార్గం రాజ మార్గం” అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.
అదేవిధంగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయసేవాధికారులకు పోలీస్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రుద్రంపూర్, సెప్టెంబర్ 12 - (జనం ముచ్చట):

చుంచుపల్లి మండలం రుద్రంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు అభిలాష, స్వరాజ్, యశ్విక్, హస్విత్ సాయి రాష్ట్రస్థాయి సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ఫిజికల్ డైరెక్టరెస్ శ్రీమతి కవిత మరియు కోచ్ పొన్నాల పృథ్వీరాజ్ తెలిపారు. సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో నిర్వహించిన సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ ఎంపిక ట్రయల్స్‌లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వారి అద్భుతమైన ఆటతీరును పరిగణనలోకి తీసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 11వ రాష్ట్ర సబ్-జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలు సెప్టెంబర్ 11 నుంచి 13వ తేదీ వరకు మంచిర్యాల జిల్లాలో జరుగుతున్నాయి. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 11 జట్లు పాల్గొంటున్నాయి. విద్యార్థుల ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. బాలాజీ, రుద్రంపూర్ సర్పంచ్ కేస్లీ, వైస్ సర్పంచ్ తోట రాజు, పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు రజాక్, మదర్ థెరిసా ట్రస్ట్ వ్యవస్థాపకులు యాకయ్య, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.